ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరులకు పూలమాల వేసి మాదిగ జాతికోసం ఏబీసీడీ వర్గీకరణ కోసం వారి ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. జిల్లా యువసేన అధ్యక్షుడు పరశురాం మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు బాలనర్సింహ, నాయకులు రమేష్, రామకృష్ణ, సాయిలు, బాలకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.
కీసర: కీసర మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బక్కని కుమార్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కీసరలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామారం సుజాత, నేతలు సంతోష్, కర్రె గణేష్, ఆంజనేయులు, శ్యామ్, అరవింద్, తనుష్ తదితరుల పాల్గొన్నారు.
◆ రాంపల్లిలో సంఘం అధ్యక్షులు బెండెల పరమేష్, ఉపాధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, మహేందర్, మల్లేష్, గౌతమ్, విజయ్‌కుమార్, తేజ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో రన్నరప్‌గా వీబీఐటీ జట్టు



ఘట్‌కేసర్: గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్యూజన్–25 చాంపియన్‌షిప్‌లో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) కబడ్డీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముఖ్యఅతిథిగా కళాశాల ఉదయ్, ప్రిన్సిపాల్ సాగర్ హాజరై క్రీడాకారులకు షీల్డ్‌తో పాటు మెమోంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీబీఐటీ పీడీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో చోరీ



మేడ్చల్‌రూరల్: పట్టణంలోని తుమ్మ చెరువు కట్టమైసమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి ఆలయం తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి చొరబడిన దొంగలు అమ్మవారి బంగారు పుస్తెలతాడు, ముక్కుపుడక, వెండి ఆభరణాలతో పాటు మైక్ సెట్టు, హుండీలోని రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడికి ఆలయ తాళాలు పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి ఆలయ కమిటీకి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆలయంలో ఇప్పటికే మూడుసార్లు చోరీ జరిగిందని, తుమ్మచెరువు కట్టపై రాత్రి వేళల్లో రోడ్డుపై కొందరు మద్యం సేవిస్తున్నారని దీనిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెన సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెన సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి (35) ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే సిబ్బంది సమాచారం మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆచూకీ తెలిసిన వారు 9440083160.

యువతి అదృశ్యం



జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ చిన్న కందిగూడలో నివసించే మెట్టు మనీషా (19) కుటుంబసభ్యులతో ఉంటోంది. గత నెల 28న ఆమె పనికోసం ఇంట్లో నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ !

అల్వాల్: సైనిక్‌పురి భావన్స్ వివేకానంద కళాశాల సైన్స్, హుమానిటీస్ అండ్ కామర్స్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులో భారతదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటేనే సమున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.





క్షేత్ర దిగ్బలి చేస్తున్న వేదపండితులు, టీటీడీ వేదవిద్యార్థులు



పూర్ణాహుతిలో వేదపండితులు

ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

వైభవంగా పూర్ణాహుతి కార్యక్రమం



కీసరగుట్ట ఆర్యవైశ్య సత్రం వద్ద కుంకుమార్చనలో మహిళలు



కీసర: కీసరగుట్ట భవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం పూర్ణాహుతి కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6 రోజుల పాటు (ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు) జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తజన రంజకంగా జరిగాయి. శనివారం బ్రహ్మోత్సవాలు సంపూర్ణం చేస్తూ వేదపండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ, వేద విద్యార్థుల బృందం దేవాలయంలో ఉదయం నుంచి క్షేత్ర దిగ్బలి కార్యక్రమం నిర్వహించారు.

పూర్ణాహుతితో దేవతలకు నివేదన..
ఆలయానికి నలువైపుల ఉన్న దేవతామూర్తులకు వరిఅన్నంతో చేసిన లడ్డూప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం యాగశాలల్లో కలశాలకు పూజచేసి దేవతలను తిరిగి సాగనంపే కార్యక్రమమైన పూర్ణాహుతి కార్యక్రమం వేదమంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ దంపతుల చేత ప్రత్యేక పూజల అనంతరం దేవతలను సంతృప్తి చేందాలని పేర్కొంటూ.. 'సర్వేజన సుఖినోభవంతు' అని కాంక్షిస్తూ యాగవస్తువులను అగ్నిగుండంలో నేతితో సహా వేస్తూ పూర్ణాహుతి చేశారు.

భారీగా తరలివచ్చిన భక్తులు..
పుణ్యావాచనము ద్వారా దేవతలను ఆహ్వానించి బ్రహ్మ నిర్దేశించినట్లుగా పరమేశ్వరుడి ఉత్సవాలను జరిపించి పూర్ణాహుతి ద్వారా దేవతలను సాగనంపే ఘట్టం ముగిసిందని వేద పంతులు మార్తి సత్యనారాయణశర్మ అన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

విశేష పూజలు.. అలంకరణ..
స్వామివారి దర్శనం అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు భక్తులు పాలు, కుంకుమ, పసుపు, నూనెలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని అలంకరించారు. అనంతరం కుటుంబసమేతంగా హుడా పార్కు, ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో వంటవార్పు చేసుకుని సాయంత్రం వరకు హాయిగా గడిపారు. ఆలయ ఫౌండర్ కుటుంబసభ్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఈవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన పూజ..
కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శనివారం వాసవిమాత అభిషేకం, కుంకుమార్చన,అమ్మవారికి ఒడిబియ్యం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా, ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాయిల శ్రావన్‌గుప్తా, కోశాధికారి నగేష్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో కంచె తొలగింపు !

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్న తహసీల్దార్



జవహర్‌నగర్ ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్‌ను తొలగించిన కబ్జాదారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీ సమీపంలోని సర్వే నెంబర్ 808లో ఐదెకరాల్లో రెవెన్యూ అధికారులు 6 నెలల క్రితమే ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి ప్రభుత్వం ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. శివరాత్రి పండుగ సెలవుల నేపథ్యంలో అదునుగా చూసిన కబ్జాదారులు ఫెన్సింగ్‌ను తొలగించారు. రాత్రికి రాత్రే రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు.



కఠిన చర్యలు తప్పవు
సుచరిత, కాప్రా తహసీల్దార్

జవహర్‌నగర్‌లో పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రజావసరాల కోసం కేటాయించాం. మిగిలిన ఖాళీ స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ వేసి కాపాడుతున్నాం. ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే వారిని అదుపులోకి తీసుకుని పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తాం. సర్వే నెంబర్ 808లో ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఫెన్సింగ్ తొలగించారని, దీనిపై ఇప్పటికే జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

కష్టపడి చదివి మంచిపేరు తెచ్చుకోవాలి

కాప్రా: విద్యార్థులు కష్టపడి చదివి సమాజం, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని అణుపురం గౌతమ్‌మోడల్ స్కూల్‌లో జరిగిన సైన్స్‌ఫేయిర్‌కు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై నమునాలను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మల్లాపూర్: యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసై, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వాటికి దూరంగా ఉండాలని, మల్లాపూర్ సాయి మోడల్ హైస్కూల్ డైరెక్టర్ సందీప్ సూచించారు.శనివారం హైస్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల చాలా మంది యువత చెడుమార్గంలో వెళ్తున్నారన్నారు. యువత వాటి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

మేడ్చల్: విద్యార్థుల జీవితంలో ఆలోచనలే అన్నింటికీ ముఖ్యమని మైసమ్మగూడ మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో నిర్వహించిన 'ఐడియాతన్ ప్రోగ్రామ్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆలోచనలు లేకుంటే సమాచారం, రీసెర్చ్‌లు ఉండవని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థిని

31వరకు రుసుము చెల్లిస్తేనే రాయితీ వర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు స్వయంగా ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఈనెల 31వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందన్న సమాచారాన్ని వారికి తెలపాల్సిన అవసరం ఉందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను పరిశీలించి క్రమబద్ధీకరణకు అర్హత సాధించిన వాటిని పరిశీలించి, వారికి సంబంధిత అధికారులు ఈనెల 30లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

నీటి ఎద్దడిపై..
వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జిల్లాలో ఉన్న బోర్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, 13 పురపాలక సంఘాలకు చెందిన కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ప్రదర్శనలను తిలకిస్తున్న డైరెక్టర్ విజయభారతి



అత్వెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

మేడ్చల్‌రూరల్: విద్యార్థుల్లో పరిశోధనా మేధస్సును పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ప్రేరణనిస్తాయని స్కూల్ ప్రిన్సిపాల్ సంయుక్త నాగోజు, డైరెక్టర్ విజయభారతి అన్నారు. కిష్టాపూర్‌లో జాతీయ సైన్స్‌డే సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ విభిన్న శాస్త్రీయ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సౌరశక్తి, జలసంరక్షణ, రసాయనిక ప్రయోగాలు, మినీ రోబోట్స్, అగ్నిప్రమాద నివారణ పద్ధతులు వంటి ప్రాజెక్టుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్న వయసులోనే శాస్త్రపరిశోధనలపై ఆసక్తి చూపడం భవిష్యత్తుకు మంచి సంకేతమని పేర్కొన్నారు.

అత్వెల్లి పాఠశాలలో..
మేడ్చల్: మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్ డే సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన పరిశోధనలు పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం తమ నిత్య జీవితంలో అలవర్చుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, రంగారావు, వసీం, మంజుల, రాంబాబు, ప్రభాకర్, రీతు, విజయలక్ష్మి, సోనీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణమహోత్సవం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రేణుకాఎల్లమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాలరాజు, దొడ్ల మల్లికార్జున్, నాయకులు సురేందర్‌గౌడ్, మధు, యాదవసంఘం నాయకులు రాముయాదవ్, నర్సింగ్, గోపాల్, చంద్రయ్య, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, స్థానిక నేతలు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



మేడ్చల్‌రూరల్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని, ఏబీఆర్‌ఎస్‌ఎమ్ ఆల్ ఇండియా కార్యదర్శి గుంత లక్ష్మణ్‌జీ అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల, అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎమ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలను ఎలా కాపాడిందో విద్యార్థులకు వివరించారు. సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించాలని కోరారు. ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిఏటా విద్యార్థులు, యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈసారి కూడా క్రీడాపోటీలు నిర్వహించామని కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ అన్నారు. శనివారం సాయంత్రం ముగింపు వేడుకల్లో భాగంగా గెలుపొందిన విజేతలకు మన్నె సుబ్రహ్మణ్యం ట్రస్టు ఎంపవర్ కంపెనీ సహకారంతో బహుమతుల ప్రదానంతో పాటు, నగదు బహుమతులను అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో సేవలందించిన వివిధ శాఖల అధికారులు, భక్తులు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ఆర్యవైశ్య, మున్నూరుకాపు, రెడ్డి సంక్షేమ సంఘం కీసరగుట్ట సంఘాల నాయకులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మండల విద్యాధికారి శశిధర్, ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి, ట్రస్టు చైర్మన్ నాగఫణీంద్ర, హనుమంత్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనుమతుల్లేని ప్రైవేట్ ఆసుపత్రులపై దృష్టి

● బొల్లారంలో క్లినిక్ సీజ్ చేసిన వైద్యారోగ్యశాఖ ● గతంలో 28 క్లినిక్‌లు, 7 డయాగ్నస్టిక్ సెంటర్ల సీజ్

సాక్షి,సిటీబ్యూరో: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లపై వైద్యారోగ్యశాఖ దృష్టి సారిస్తోంది. నగర శివారులో జాతీయ సహా పలు రహదారుల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులు వెలుస్తుండటంతో పాటు ఇష్టానుసారంగా రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ **సమాచారం లేకుండా నిర్వహణ..**
ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేసి ఫీజుల వివరాల పట్టికతో సహా డాక్టర్లు,సిబ్బంది,పడకల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపరచాల్సి ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. వైద్యశాఖ పర్యవేక్షణ కొరవడటమే దీనికి కారణంగా తెలుస్తోంది.

◆ **ఒక అనుమతితో మూడు బ్రాంచ్‌లు..**
ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకుని రెండు, మూడు బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నారు. ఎలాంటి పరిశీలన, విచారణ లేకుండానే వైద్యారోగ్యశాఖ అనుమతులు ఇస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో వందల సంఖ్యలో క్లినిక్‌లు, ఆసుపత్రులు ఇలానే నిర్వహిస్తున్నట్లు సమాచారం.

◆ **అనవసరంగా వైద్య పరీక్షలు..**
అవసరం లేకుండా ఇష్టానుసారంగా వైద్యపరీక్షలు చేస్తూ.. పేదల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. ప్రైవేటు డయాగ్నస్టిక్, అల్ట్రాసౌండ్ సెంటర్లపై ఇటీవల అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలను పాటించని సెంటర్లపై చర్యలకు జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది.

◆ **బొల్లారంలో క్లినిక్ సీజ్..**
తాజాగా శుక్రవారం క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాన్ని ఉల్లంఘించిన భవానీ పాలీ క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టరు ఉమాగౌరీ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు.



క్లినిక్ నిర్వాహకులు నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా అవతారమెత్తి, హైడోస్ యాంటీబయాటిక్స్ రాయడం, ఐవీ ఇన్ఫ్యూషన్లు ఇవ్వడం వంటి అనుచిత వైద్యచర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అర్హతలేని వ్యక్తులతో నడుస్తుందన్న ఫిర్యాదుతో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.


◆ **నిబంధనలు ఇలా..**
అలోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరఫీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులతో పాటు పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌తో సహా అన్నిరకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు.

◆ **ఫీజుల వసూళ్లపై...**
ప్రైవేట్ ,కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు మొదలుకుని వైద్య పరీక్షలు తదితర వాటిల్లో దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్యశాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని వాటికి సూచినలు చేస్తోంది.

◆ **అనుమతిలేనివి ఎక్కువే..**
మేడ్చల్ జిల్లాలో 2,730 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా.. ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్నట్లు ఆసుపత్రులు 1755 మాత్రమే ఉన్నాయి. అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 975 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో 100 కంటే ఎక్కువ పడకలు(బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా.. 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, 180 డెంటల్ ఆసుపత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08రిహాబిలిటేషన్ సెంటర్లు, అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉన్నాయి. అనుమతి లేకుండా 400 వరకు స్కానింగ్ సెంటర్లు ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా.



నిబంధనలు పాటించని వాటిపై చర్యలు



ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించని ప్రైవేట్ క్లినిక్‌లు, ప్రైవేట్ ఆసుపత్రులు, దయాగ్నస్టిక్ సెంటర్లపై నోటీసులు జారీ చేసి,సీజ్ చేస్తాం.అధిక ఫీజుల వసూళ్లతో ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – డా.ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387